ఇన్‌చార్జి ఎంపీపీకి సత్కారం

రామడుగు(చొప్పదండి), ఏప్రిల్ 13: రామడుగు ఇన్‌చార్జి ఎంపీపీ పూరేళ్ల గోపాల్‌ను మండల యువకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్యాం సుందర్ రెడ్డి, మామిడి దిలీప్ కుమార్, అనుపురం పరశురామ్ గౌడ్, అనుపురం శ్రీనివాస్, మనోజ్ గౌడ్, బీ శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బీజేపీ

తెలంగాణచౌక్, ఏప్రిల్ 13: బీజేపీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందారెడ్డి ఆరోపించారు. నగరంలోని యూనియన్ కార్యాలయం (ముకుందలాల్ మిశ్రా భవనం)లో శనివారం యూనియన్ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం-ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం' సెమినార్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐతో దాడులు చేయిస్తూ కక్షసాధింపులకు పాల్పడుతున్నదని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేశం, శ్రీనివాస్, రాజమల్లు, రవి, శంకర్, రమేశ్, శ్రీలత పాల్గొన్నారు.

ఉగాది కాలెండర్ ఆవిష్కరణ

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 13: హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్‌ను శనివారం ఏఎస్ఐ సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం హుజూరాబాద్ 2వ కోర్టు ఆవరణలో అసిస్టెంట్ ఆఫీసర్ శ్రీనివాస్‌తోపాటు పోలీసు, కోర్టు సిబ్బందికి క్యాలెండర్ వితరణ చేశారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- హుజూరాబాద్ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు రవీందర్‌రెడ్డి, సతీశ్, వంశీ, గోపి, కుమార్, రామస్వామి, పద్మ, శ్రీదేవి, చారి, బిందు, తిరుపతి, సరిత, జ్యోతి, శకుంతల, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

'చర్యలు తీసుకోవాలి'

జమ్మికుంట, ఏప్రిల్ 13: రేషన్ బియ్యం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జమ్మికుంట జోన్ కార్యదర్శి శీలం అశోక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అక్రమ దందాకు రేషన్ డీలర్లే ప్రధాన సూత్రధారులని, సివిల్ సప్లై అధికారులు నిఘా పెట్టాలని కోరారు. లబ్ధిదారుల బియ్యాన్ని మిల్లర్లకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. రేషన్ బియ్యం దందా చేస్తున్న వ్యాపారులపై పీడీ యాక్టు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ బియ్యం లబ్ధిదారులకు అందేలా చూడాలని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

WANTED

★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మల్కాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టవద్దు
- టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి
- రైతులకు సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలి
- కలెక్టర్ పమేలా సత్పతి
- కొత్తపల్లి మండలం మల్కాపూర్, బద్దిపల్లిలో కొనుగోలు కేంద్రాల పరిశీలన

కొత్తపల్లి, ఏప్రిల్ 13: కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం వెంటవెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని కలెక్టర్ పమేలా సత్పతి నిర్వాహకులకు సూచించారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్, బద్దిపెల్లి గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది.. ఆయా సెంటర్ల పరిధిలో ఎంత మంది రైతులు ఉన్నారు.. ఇంకా ఎన్ని క్వింటాళ్ల ధాన్యం రానుంది.. అన్ని సౌకర్యాలు కల్పించారా అని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించారు. సరైన తేమశాతం వచ్చేలా ధాన్యాన్ని ఆరబెట్టాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తేమ శాతం పేరిట ధాన్యానికి ఎలాంటి కోత విధించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. రైస్ మిల్లర్లు సైతం ధాన్యం విషయంలో ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలున్నా రైతులు మా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలతో పాటు రైస్ మిల్లర్లకు గన్నీ బ్యాగులు అందించాలన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయా సెంటర్ల ఇన్‌చార్జులు, మిల్లర్లు ధాన్యాన్ని తక్కువ ధరకు కొనవద్దని, ఏ చిన్న పొరపాటు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మల్కాపూర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద విశ్రాంతి తీసుకునేందుకు షెడ్లు నిర్మించాలని కలెక్టర్‌కు రైతులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం రజినీకాంత్, నాయబ్ తహసీల్దార్ సురేందర్, ఆర్ఐ అరుణ్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకలను ప్రారంభిస్తున్న కిమ్స్ చైర్మన్ పేర్యాల రవీందర్ రావు, తదితరులు

అట్టహాసంగా వీడ్కోలు వేడుక

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 13: నగరంలో కిమ్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వీడ్కోలు వేడుకలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పేర్యాల రవీందర్ రావు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళిక ప్రకారం చదివితే అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. కిమ్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, పాటలు, ర్యాంప్ వాక్ అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్ రావు, అధ్యాపకులు సంపత్ కుమార్, తిరుపతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

రామడుగు (చొప్పదండి), ఏప్రిల్ 13: మండల కేంద్రంలోని చిట్యాల పద్మ, బత్తిని విజయ, గుర్రం లక్ష్మీరాజం ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను శనివారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు మామిడి దిలీప్ కుమార్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, అనుపురం పరశురామ్ గౌడ్, మనోజ్, అనుపురం శ్రీనివాస్, బత్తిని విజయ్, కారుపాకల నరేశ్ పాల్గొన్నారు.

డంప్ యార్డును తరలించాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 13: ఆటోనగర్‌లోని డంప్ యార్డును వేరే చోటుకు తరలించాలని సోషల్ జస్టిస్ ఫర్ వర్ల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి మనోహర్, సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ హన్మాగౌడ్ అధికారులను కోరారు. నగరంలోని ప్రెస్‌భవనంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, డంప్ యార్డులో మంటలు వ్యాపించడంతో పొగ వచ్చి సమీప కాలనీల వాసులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ రాజేశ్వరి, వైస్ చైర్మన్ వెంకటరామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న మానేరు విద్యా సంస్థల అధినేత అనంతరెడ్డి, తదితరులు

విద్యార్థులకు అభినందన

కొత్తపల్లి, ఏప్రిల్ 13: కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు హైదరాబాద్ టాపర్స్ ఐఐటీ ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి మెడల్స్, సర్టిఫికెట్లను అందుకున్నారు. కాగా, శనివారం విద్యార్థులను మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

విదేశీ విద్యపై అవగాహన

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 13: విదేశాల్లో విద్యనభ్యసించేందుకు జియో 7 ఫ్లై సొల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో అవకాశాలు కల్పించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ముఖరమ్ మహ్మద్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని ఓ హోటల్‌లో శనివారం గ్రాండ్ స్టడీ అబ్రాడ్ ఫెయిర్ పేరిట విద్యార్థులకు అవగాహన కల్పించి, స్పాట్ అడ్మిషన్లు తీసుకున్నారు. యూకే, యూఎస్, కెనడా, న్యూజిలాండ్, జార్జియాతోపాటు పలు దేశాల యూనివర్సిటీల ప్రతినిధులు హాజరుకాగా, విద్యార్థులు ఆయా యూనివర్సిటీ ప్రతినిధులతో మాట్లాడి, సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖరమ్ మాట్లాడుతూ, కేవలం రూ. 5 లక్షలకే విదేశాల్లో విద్యనభ్యసించడానికి అడ్మిషన్లు పొందవచ్చని చెప్పారు. సంబంధిత ఫైనాన్స్ కంపెనీల సహకారంతో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. వివరాలకు జియో 7ఫ్లై వెబ్‌సైట్ తోపాటు సెల్ నంబర్ 88188 10711లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హజ్ మాజీ డైరెక్టర్ సయ్యద్ ఇర్ఫాన్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి జమీలొద్దీన్, బీఆర్ఎస్ నేత షౌకత్ అలీ, జియో 7 ఫ్లై ప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉండే వినోద్‌కుమార్‌ను గెలిపించండి

మాట్లాడుతున్న వినోద్‌కుమార్ వియ్యంకుడు డాక్టర్ ఎర్రబెల్లి తిరుమలరావు

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్13: తెలంగాణ ఉద్యమకారుడు, విద్యావంతుడు, న్యాయవాది కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి అని, ఎన్నికల్లో ఆయనను గెలిపించాలని శనివారం హుజూరాబాద్ పట్టణంలో ఆయన బంధువులు ప్రచారం నిర్వహించారు. స్కూల్స్, కాలేజెస్ కరస్పాండెంట్స్‌తో నిర్వహించిన సమావేశంలో వినోద్‌కుమార్ వియ్యంకుడు డాక్టర్ ఎర్రబెల్లి తిరుమలరావు మాట్లాడుతూ.. తెలంగాణ సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి వినోద్‌కుమార్ అని, గతంలో ఆయన ఎంపీగా ఉన్న సమయంలో రాష్ట్ర సమస్యలపై పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీశారని గుర్తు చేశారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాష్ట్ర సమస్యలపై ప్రశ్నించే వినోద్‌కుమార్‌ను గెలిపించడం వల్ల కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంతో పాటు రాష్ట్రానికీ మేలు జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి కోసం ఆయనను ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థల కరస్పాండెంట్లు ముచ్చ నారాయణరెడ్డి, కోరం సంజీవరెడ్డి, సుంకిశాల సంతోష్‌రావు, బద్దుల రాజ్‌కుమార్, పరాంకుశం కిరణ్‌కుమార్, వకుళాభరణం వెంకటేశ్వర్లు, మాడిశెట్టి ప్రసాద్, పీ విజయపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ అమలు బాధ్యత పంచాయతీలదే

కలెక్టరేట్, ఏప్రిల్ 13: ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న వివిధ పనుల అమలుతో పాటు హాజరయ్యే కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించే బాధ్యత గ్రామ పంచాయతీలదేనని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా స్పష్టం చేశారు. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, గతంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో ఉపాధి హామీ పనులు జరుగగా, కూలీలకు అవసరమైన సౌకర్యాలు కూడా ఆ శాఖనే కల్పించేది. కాగా, గతేడాది నుంచి ఉపాధి పనులపై పంచాయతీలకే అజమాయిషీ కల్పించింది. సౌకర్యాల కల్పనకు అవసరమైన నిధులు నేరుగా పంచాయతీ ఖాతాలో జమ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

ఉపాధి కూలీకి తీవ్ర గాయం

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 13: వేగురుపల్లిలో కొనసాగుతున్న ఉపాధి పనుల్లో ఈ నెల 11న అలుగువెల్లి రమాదేవి అనే కూలీకి చెట్టు కొమ్మ తగిలి ముక్కు పైభాగంలో తీవ్రగాయమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్.. రమాదేవి భర్త అనిల్ రెడ్డికి సమాచారం ఇచ్చి కరీంనగర్‌లో ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు పంపించగా, డాక్టర్లు పరీక్షించి, సర్జరీ అవసరమని తెలిపారు. ఈ విషయమై ఫీల్డ్ అసిస్టెంట్‌కు తెలియజేయగా సర్జరీకి అయ్యే ఖర్చు పెట్టుకొమ్మని, తర్వాత మెడికల్ బిల్లు పెట్టుకోవాలని సూచించినట్లు అనిల్ రెడ్డి తెలిపారు. కాగా, ఇంత పెద్ద ఘటన జరిగినప్పటికీ అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వినియోగదారుల మన్ననలు చూరగొనాలి

ఔట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న వొడితెల ప్రణవ్‌బాబు

హుజూరాబాద్, ఏప్రిల్ 13: వినియోగదారుల మన్ననలు చూరగొంటేనే ఏ సంస్థ అయినా అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఎస్సార్కే డెయిరీకి సంబంధించిన పాలు, పాల పదార్థాల ఔట్‌లెట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎస్సార్కే డెయిరీ నెలకొల్పిన అనతి కాలంలోనే ప్రజలకు చేరువైందని తెలిపారు. కార్యక్రమంలో డెయిరీ చైర్మన్ బండారి మారుతి, ఎండీ కృష్ణంరాజు, డైరెక్టర్ ఆకుల రమేశ్, నాయకులు విజయ్‌కుమార్, నేరెళ్ల మహేందర్‌గౌడ్, శ్రీనివాస్, కిరణ్ రెడ్డి, ఔట్‌లెట్ ఇన్‌చార్జి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

యువ గర్జనకు తరలిరావాలి

గంగాధర, ఏప్రిల్ 13: కరీంనగర్‌లోని 'వీ' కన్వెన్షన్‌లో ఈ నెల 14న నిర్వహించే మున్నూరుకాపు యూత్ ఫోర్స్ గర్జన సభను విజయవంతం చేయాలని మున్నూరుకాపు యువజన సంఘం నాయకుడు ఆకుల మనోహర్ పటేల్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. యూత్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని బొమ్మ వెంకన్న విగ్రహం నుంచి 'వీ' కన్వెన్షన్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని మున్నూరుకాపు యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, ఫైర్ అధికారులు

రాంనగర్, ఏప్రిల్ 13: జిల్లాలో ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారులు వెంకన్న, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 13: అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టౌన్ సీఐ రమేశ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ అగ్నిమాపక అధికారి చల్లూరి రాజయ్య, ఎస్ఐ సాంబయ్యగౌడ్, ఏఎస్ఐ సత్యనారాయణ, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తిమ్మాపూర్, ఏప్రిల్13: ఎల్ఎండీ కాలనీలో శ్రీ చైతన్య డిఫెన్స్, స్పోర్ట్స్ అకాడమీలో శరత్ మ్యాక్స్ విజన్, కేశవ ఈఎన్‌టీ, కేకే డెంటల్ హాస్పిటల్స్ వైద్య సిబ్బంది శనివారం 192 మంది డిఫెన్స్ శిక్షణ అభ్యర్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఆర్మీ, డిఫెన్స్ రంగాల్లో రాణించడానికి ఆరోగ్యపరమైన అవగాహన కల్పించారు. విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, డిఫెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్యాంసుందర్‌రెడ్డి, లైబ్రేరియన్ గొంటి రమేశ్, పీడీ మహిపాల్‌రెడ్డి, సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 13: ఈ నెల 14న సిరిసిల్లలో జరుగనున్న ఎమ్మార్పీఎస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రుద్రారపు రామచంద్రం మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారని, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, యువసేన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మారేపల్లి శ్రీనివాస్, మహాజన సోషలిస్ట్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనూరి రవీందర్, ఎమ్మార్పీఎస్ హుజూరాబాద్ మండలాధ్యక్షుడు బొరగాల రాజ్‌కుమార్, నాయకులు కలవల మల్లయ్య, డాక్టర్ తడికమళ్ల శేఖర్, మోరే సతీశ్, రవితేజ పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కు పాదం మోపాలి

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్13: గంజాయి స్మగ్లింగ్‌పై ప్రభుత్వం ఉక్కు పాదం మోపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నగర కార్యదర్శి గోస్కుల అజయ్ కోరారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గంజాయికి బానిసైన వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, వాటిని అరికట్టడంలో తల్లిదండ్రులు, విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో రేణు ప్రసాద్, లక్ష్మణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 13: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్న అంబేద్కర్ 133వ జయంత్యుత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేద్కర్ జయంత్యుత్సవ హుజూరాబాద్ కమిటీ చైర్మన్ మహ్మద్ ఖలీక్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి ఇల్లందుల సమ్మయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. అంబేద్కర్ వాదులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ సమావేశానికి తరలిన యువకులు

సైదాపూర్, ఏప్రిల్13: హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన, విద్యార్థి సమావేశానికి సైదాపూర్ మండలం నుంచి యువకులు, విద్యార్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలుపునకు కృషిచేస్తామన్నారు.

క్రీడల్లో శ్రీచైతన్య విద్యార్థుల హవా

తిమ్మాపూర్, ఏప్రిల్ 13: ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పలు క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపగా.. క్రీడా జట్లను కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి శనివారం అభినందించారు. వరంగల్‌లో వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో స్టేట్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్‌లో రన్నర్స్ ట్రోఫీని కళాశాల విద్యార్థులు అందుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడల్లో పాల్గొని కళాశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ట్రోఫీ అందజేస్తూ విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ రమేశ్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో ప్రతి కార్యకర్తకూ న్యాయం

సైదాపూర్, ఏప్రిల్13: బీఆర్ఎస్‌లో ప్రతి కార్యకర్తకూ న్యాయం జరుగుతుందని పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ సుధీర్‌కుమార్ ఎన్నికపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత కేసీఆర్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

గంగాధర, ఏప్రిల్ 13: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 10 రోజులుగా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని కోరారు.

వీధికి మోటర్ వితరణ

తిమ్మాపూర్, ఏప్రిల్13: ఇందిరానగర్ గ్రామంలోని 4వ వార్డులో బోరు మోటర్ చెడిపోయి వీధి ప్రజలు నీళ్లకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి సొంతంగా బోర్ మోటర్ సెట్ అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

మానకొండూర్, ఏప్రిల్ 13: రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జోన్ కార్యదర్శి సుంకరి సంపత్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగి కోతలు ప్రారంభమై 17 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో రైతులు ఆందోళనలు చెందుతున్నారని తెలిపారు. అధికారులు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రతి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం జోన్‌కమిటీ సభ్యుడు నారాయణ, నాయకులు పవన్, ఎండీ గౌరె మియా, సంపత్, సంపత్‌రెడ్డి, ఎల్లయ్య, బాలయ్య, సురేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

సొంత గూటికి మాజీ కౌన్సిలర్ దంపతులు


శ్రీదేవి-కమలాకర్ దంపతులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్13: హుజూరాబాద్ మాజీ ఎంపీటీసీ, మాజీ కౌన్సిలర్ కొయ్యడ శ్రీదేవి-కమలాకర్ దంపతులు శనివారం రాత్రి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో తిరిగి సొంత గూటికి చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, శుక్రవారం కొందరి ప్రోద్బలం మేరకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవాల్సి వచ్చిందని, అయితే తాము ఎప్పటికీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతామని కొయ్యడ శ్రీదేవి-కమలాకర్ దంపతులు స్పష్టం చేశారు.

అంబేద్కర్ జయంతి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 13: నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ సమత ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, క్యాట్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులు రుచిత, ఎన్ రాణి తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సుష్మ, సిబ్బంది లలితా అశ్విని, డాక్టర్ లావణ్య, డాక్టర్ సుహాసిని, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రామరాజ్యం రావడానికి కృషి చేయాలి

ఆశీర్వచనం చేస్తున్న చిన జీయర్ స్వామి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 13 : రామరాజ్యం రావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పరిపాలకులు మంచివారై, వారి ఆలోచనా సరళి బాగుంటే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి పేర్కొన్నారు. జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతున్న వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం, సాయంత్రం స్వామి వారు ప్రవచనం చేశారు. ఇటీవల జ్యోతినగర్‌లో పునర్నిర్మించిన ఆండాళ్ గోష్ఠిని స్వామి వారు సందర్శించారు. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు, వీర్ల ప్రభాకర్ రావు, కలకొండ గౌతమరావు, బీవీ రావు, యాద కిషన్, ఎల్ భూపతిరావు, ఎస్ వెంకటేశం, వరప్రసాదాచార్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టవద్దు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 13: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టవద్దని జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు సిబ్బందికి సూచించారు. కరీంనగర్ రూరల్ మండలం చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని దుర్శేడ్, కరీంనగర్ సింగిల్ విండో సీఈవోలు వేణు, రమేశ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో దుర్శేడ్ సింగిల్ విండో చైర్మన్ తోట తిరుపతి, డైరెక్టర్లు దాడి లచ్చయ్య, కందుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.